క్లుప్తంగా

శాస్త్రోక్తంగా హోమాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేట శంకరమఠంలో కంచికామకోటి పీఠానికి చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం ఉదయం మహామృత్యుంజయ, ఆయుష్య, నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం నవావరణ, శ్రీసుబ్రహ్మణ్య త్రిశతి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పాల్గొని పర్యవేక్షించారు.

కారుణ్య నియామకం



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తూ మేకల శివకుమార్ మరణించగా, కారుణ్య నియామకం కింద ఆయన కుమారుడు సుజిత్‌ను పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా నియమిస్తూ కమిషనర్ నందన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం నియామకం పత్రాలను అందజేశారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ సులోచన పాల్గొన్నారు.

నిర్మల్ చక్రవర్తికి డాక్టరేట్



నిర్మల్ చక్రవర్తి

నెల్లూరు (టౌన్): నగరానికి చెందిన జి.నిర్మల్ చక్రవర్తికి డాక్టరేట్ లభించింది. విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రొఫెసర్ శైలజ పర్యవేక్షణలో జిల్లా తీర ప్రాంతంలో లభించే అల్చిప్పల బయో డైవర్సిటీ, వాటి కణజాలం, కాలుష్య ప్రభావంపై చేసిన పరిశోధనకు యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

యూనిఫామ్స్ అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు జిల్లా సహకార ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో యూనిఫామ్స్‌ను శనివారం అందచేశారు. కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప, డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాంక్ అకౌంట్ తెరవండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇంటర్మీడియట్‌లో చేరిన షెడ్యూల్ కులాల విద్యార్థులకు తల్లికి వందనం నిధులు జమ అయ్యేందుకు బ్యాంక్ అకౌంట్ ఉండాలని, లేని వారు వెంటనే పోస్టల్ బ్యాంక్ అకౌంట్ చేయించుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారిణి కె.శోభారాణి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే బ్యాంకు అకౌంట్ ఉంటే దానికి ఎన్‌పీసీఐ లింక్ చెక్ చేసుకోవాలన్నారు. తల్లికి వందనం రెండో విడత నిధులు త్వరలో ప్రభుత్వం విడుదల చేయనుందని, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయమై ఎస్సీ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

ఆధునిక వైద్యం అందేలా కృషి

నెల్లూరు(అర్బన్): వైద్యరంగంలో వస్తున్న ఆధునిక చికిత్స విధానాలు ప్రజలందరికీ అందించేలా డాక్టర్లు కృషి చేయాలని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నారాయణ మెడికల్ కళాశాలలో జరుగుతున్న 32వ ఏపీ న్యూరోకాన్ సదస్సును రెండో రోజు శనివారం మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు. న్యూరాలజీ సమస్యలకు సంబంధించిన జబ్బులు, వాటి నివారణకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యవిధానాలను డాక్టర్లు చర్చించడం అభినందనీయమన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల నుంచి సుమారు 700 మంది డాక్టర్లు పాల్గొంటున్న సదస్సుకు తమ కళాశాల వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, న్యూరాలజీ విభాగాధిపతి సంపత్‌కుమార్, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ శరణి, అపోలో ఆస్పత్రి న్యూరాలజిస్ట్ ఏవీ రమణమూర్తి, వైద్యవిద్యా సంస్థల కో–ఆర్డినేటర్ బిజు రవీంద్రన్, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఆస్పత్రి ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కుక్కలకు ఉచితంగా టీకాలు

నెల్లూరు (పొగతోట): జూలై 6న జునోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తామని పశు సంవర్ధకశాఖ ఏడీ చైతన్య కిశోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కలిగిస్తామన్నారు. ముఖ్యంగా పెంపుడు జంతువులకు జునోసిస్ వ్యాధులు రాకుండా సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు.

నేత్రపర్వంగా తపస్సుమాను ఉత్సవం

- విశేషంగా తరలివచ్చిన భక్తజనం



కనుల పండువగా జరుగుతున్న పాశుపతాస్త్ర ఘట్టం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ రోజు శనివారం రాత్రి తపస్సుమాను ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో పూజలు విశేషంగా నిర్వహించారు. ఉదయం భగవద్గీత పఠనం, సాయంత్రం మహాభారత పురాణ కాలక్షేపం నిర్వహించారు. ఉభయకర్తలుగా గండవరపు శివయ్య, అనిత, చింతాల శ్రీనివాసులు, ధరణి దంపతులు వ్యవహరించారు. ఈఓ జానకి పర్యవేక్షించారు.

అర్జునుడికి పాశుపతాస్త్రం ఒసగిన పరమేశ్వరుడు

శ్రీకృష్ణధర్మరాజస్వామి దేవస్థానం సమీపంలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం నుంచి పరమేశ్వరుడు పాశుపతాస్త్రాన్ని అర్జునుడికి అనుగ్రహించేందుకు తరలివచ్చారు. అర్జునుడికి పరమేశ్వరుడు పాశుపతాస్త్రాన్ని అందజేసే ఘట్టం ఎంతో విశేషంగా సాగి భక్తులు ఆనందపారవశ్యంలో ఓలలాడింపజేసింది. పాశుపతాస్త్రాన్ని అందుకున్న అర్జునుడు తపస్సుమానును అధిరోహించడంతో ఉత్సవం పరిసమాప్తమైంది

ప్రసాద వితరణ

తపస్సుమాను ఉత్సవంలో సంతాన సౌభాగ్యంతో పాటు విద్య, వ్యాపార, ఉద్యోగ, సకల విజయాలు చేకూరుతాయన్న నమ్మికంతో తపస్సుమాను శిఖరంపై నుంచి ఫలములు, మిఠాయిలు ప్రసాద వితరణ చేయడం(విసరడం) నిర్వహించారు. వీటిని అందుకునేందుకు ప్రజలు పోటీపడి పులకించిపోయారు.



ప్రసాదాన్ని అందుకునేందుకు తరలివచ్చిన భక్తులు



తమస్సుమాను పైనుంచి ఫలములను విసురుతూ..

బారాషహీద్ దర్గాలో పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ ఆనంద్



దర్గా ప్రాంగణంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగ నేపథ్యంలో బారాషహీద్ దర్గాలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో రొట్టెల పండగ ఏర్పాట్లను ఎస్పీ కృష్ణకాంత్, కమిషనర్ నందన్‌తో కలిసి కలెక్టర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. దర్గా ప్రాంగణంలోని పోలీస్ కంట్రోల్ రూమ్, స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం దర్గా ప్రాంగణంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈనెల 6 నుంచి ఐదు రోజులపాటు జరిగే రొట్టెల పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులను ఎటువంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల హెచ్‌ఓడీలు నిరంతరం అందుబాటులో ఉంటూ ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. రెండు గంటలకు ఒకసారి దర్గా ప్రాంగణంలోని అన్ని దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి విద్యుత్, అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దర్గాకు వచ్చిన భక్తులు సంతృప్తిగా దర్శనం చేసుకుని ప్రశాంతంగా తిరిగి వెళ్లడమే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సింధుప్రియ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా..

రొట్టెల పండగను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి, సిబ్బంది కృషి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. బారాషహీద్ దర్గాలో వివిధ విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పర్యవేక్షించారు. దర్గా ప్రాంగణంలో షామియానాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, ఉచిత వైద్య శిబిరాలు, ఎన్టీఆర్ సుజల తాగునీటి కేంద్రాలు, వీఐపీ రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేశారు. పండగ జరిగే అన్ని రోజుల్లో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నామని తెలిపారు.

రూ.2,300 కోట్లకు డీసీసీబీ ఆదాయం



రుణాల చెక్కులు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ ధనుంజయరెడ్డి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రూ.2,300 కోట్ల ఆదాయంలో ఉందని, ఎందరో కృషి ఫలితమే నేడు ఈ స్థాయికి చేరుకుందని ఆ బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి అన్నారు. 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం బ్యాంకులో రుణమేళా నిర్వహించారు. తొలుత ఆయన సహకార పతాకాన్ని ఎగురవేసి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు ఇచ్చే రుణాలు తగ్గించేందుకు, షేర్ క్యాపిటల్‌కు బోనస్ ఇచ్చేలా సమూల మార్పులు తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రధానంగా బ్యాంకు ద్వారా రుణాలు తీసుకున్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలని, డీసీసీబీని తమ బ్యాంకుగా భావించి డిపాజిట్లు చేయడం ద్వారా వచ్చే ఆదాయం మన ప్రాంత ప్రజలు, రైతులకు దక్కుతుందన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు రూ.52 లక్షలు, ఎస్టీయేతరులకు రూ.1,73,50,000, హౌసింగ్ రుణాలు రూ.2,05,00,000 మొత్తం రూ.4,30,50,000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్ర మంలో డీసీఓ గుర్రప్ప, డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి, డీసీసీబీ జీఎం సరిత, నాబార్డ్ డీడీఎం బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.20 కోట్ల అపరాధ రుసుం వసూలు

నెల్లూరు(బారకాసు): లోక్ అదాలత్ ద్వారా కార్పొరేషన్ పరిధిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి రూ.62.99 లక్షలు, టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రూ.58 లక్షలు వసూలు చేసినట్లు కమిషనర్ నందన్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు 264 మందికి గానూ 110 మంది హాజరై నగరపాలక సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పన్నుల వసూలు కేంద్రంలో 68 కేసులలో పై మొత్తాన్ని స్పాట్ పేమెంట్ కింద చెల్లించగా మరో 42 మంది మరింత సమయం కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వివిధ సంస్థలు, ప్రజలు తమ బకాయిలకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందేందుకు నేషనల్ లోక్ అదాలత్ న్యాయస్థానం ద్వారా సెటిల్మెంట్ చేసుకున్నారని తెలిపారు. మొత్తం రూ.8.3 కోట్ల గానూ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అపరాధ రుసుము చెల్లించాలని పన్ను ఎగవేతదారులకు సమన్లు జారీ చేసి ఉన్నామని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి జీవనోపాధులు

నెల్లూరు (పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలకు జీవనోపాధి కల్పించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని డీఆర్‌డీఏ పీడీ నాగరజాకుమారి అన్నారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఎఫ్‌పీఓసీసీలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో శనివారం పీడీ మాట్లాడారు. జీవనోపాధులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. బ్యాంకులు లేదా స్త్రీ నిధి నుంచి రుణాలు మంజూరు చేయించాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీవనోపాధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వినూత్నమైన నూతన జీవనోపాధుల కల్పనకు కృషి చేయాలన్నారు. మహిళలు ఏర్పాటు చేసుకున్న పరిశ్రమల ద్వారా ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ పీఎంఎఫ్ఎంఈ ద్వారా రైతులు లేదా సభ్యులు ఏ విధంగా రుణాలు పొందాలో సూచించారు. యూనిట్ల ఏర్పాటు, వాటికి సంబంధించిన మిషనరీ కొనుగోలుకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప, నాబార్డు డీడీఎం డాక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆశాలత



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

నెల్లూరు(అర్బన్): నగరంలోని సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా వీఎఫ్ ఆశాలత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తిరుపతిలోని పద్మావతి కళాశాలలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ప్రిన్సిపల్‌కు ఇక్కడ ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న వసుంధర బాధ్యతలు అప్పగించారు. కళాశాల ఫ్యాకల్టీ ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశాలత మాట్లాడుతూ కళాశాల విద్యార్థినుల కోసం ఎగ్జామినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఇక్కడి సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

హాస్టళ్లను సక్రమంగా నిర్వహించండి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో ఉన్న బీసీ హాస్టళ్లను వార్డెన్లు సక్రమంగా నిర్వహించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి పి.వెంకట లక్ష్మమ్మ అన్నారు. నగరంలోని శోధన్ నగర్‌లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్‌లో బీసీ సంక్షేమ హాస్టళ్ల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, ఆహారం, చదువు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదలకు డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు (పొగతోట): రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఇంజినీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జిల్లాల్లో కార్యవర్గాలను ఏర్పాటు చేసి పంచాయతీరాజ్ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై సంఘం పనిచేస్తుందన్నారు. ఈనెల 27న రాష్ట్రస్థాయిలో కార్యవర్గ సమావేశం ఉందన్నారు. సభ్యులందరూ హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు, జిల్లా అడ్వైజర్ షౌకత్ హుస్సేన్, పెంచలయ్య, దామోదరం, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న మూలం రమేష్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆటో కార్మిక సంఘ నగర కార్యదర్శి పిడుగు మురళి సంతాపసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం మురళి ఎంతో కృషి చేశారని, ఒక మంచి నాయకుడిగా ఎదుగుతున్న సమయంలో గుండెపోటుతో మృతిచెందడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 21తో పాటు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మురళి కుటుంబసభ్యులకు కార్మిక సంఘాల సహకారంతో రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నగర, రూరల్ కార్యదర్శులు నాగేశ్వరరావు, పెంచల నరసయ్య, ఆటో కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోస్టర్ ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10 చలో విజయవాడ కార్యక్రమ పోస్టర్‌ను స్థానిక వీఆర్సీ సెంటర్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి షారూఖ్ మాట్లాడుతూ ఫీజు బకాయిల పెండింగ్, గుర్తింపు లేకుండా పాఠశాలల నిర్వహణ తదితర సమస్యలపై ఉద్యమించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఆసిర్, ఖాదర్‌మస్తాన్, హర్ష, నవీన్, వంశీ, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నెల్లూరురూరల్: వృద్ధాప్యంలో ఉన్న మాకు గత రెండు నెలల నుంచి పింఛన్, ఐదు డీఏలు ఇవ్వకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా ఆరుగురు ఉద్యోగులు పదవీ విరమణ పొందారని, వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సుబ్బారెడ్డి, పెంచలయ్య, సుధాకర్, ఆచారి, రంగారెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ బస్టాండ్‌లో వివాహిత అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరంలో అంజయ్య కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన భార్య తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఉండటంతో దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీన దంపతులు, తమ బంధువుతో కలిసి ఊర్లెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. అక్కడ వివాహిత అదృశ్యమైంది. ఈ మేరకు భర్త శనివారం చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాలు మాయం

నెల్లూరు(క్రైమ్): బీరువాలోని 34 గ్రాముల బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంగళరావ్‌నగర్‌లో విశ్రాంత రైల్వే ఉద్యోగులు వెంకటేశ్వర్లు, కొండమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్నకుమారుడు ప్రసన్నకుమార్‌కు వివాహం నిశ్చయమైంది. ఆయన గత నెల 29న బీరువాలోని తన బంగారు బ్రాస్‌లెట్, రెండు చైన్ల కోసం చూడగా కనిపించలేదు. దీనిపై ఈనెల 4వ తేదీ రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనిమనిషిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు నెల్లూరు రైల్వే సీఐ ఎ.సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జి.మురళీధర్ పర్యవేక్షణలో 105 మంది సిబ్బందితో నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్, సౌత్, వేదాయపాళెం, వెంకటాచలం రైల్వేస్టేషన్‌లలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, నేరాలు జరగకుండా చర్యలు తీసుకునామన్నారు. రంగనాయకులపేట రైల్వేగేటు, ఆత్మకూరు బస్టాండు రైల్వే బ్రిడ్జి, నక్కలోళ్ల సెంటర్, సౌత్ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా గస్తీని ఏర్పాటు చేశామని చెప్పారు.

బీఎల్వోలకు శిక్షణ

నెల్లూరురూరల్: జిల్లాలో బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించినట్లు కలెక్టరేట్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జూలై 5 నుంచి 12 వరకు బ్యాచ్‌కు 50 మంది చొప్పున షెడ్యూల్ ప్రకారం శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు.

నేడు మంత్రుల రాక

నెల్లూరు సిటీ: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆదివారం రాత్రి 9.40 గంటలకు నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం 9 గంటలకు నగరంలోని వీఆర్ హైస్కూల్‌ను లోకేశ్ ప్రారంభిస్తారు. 10.40 గంటలకు అనిల్ గార్డెన్స్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు నెల్లూరు బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండగలో పాల్గొంటారు.

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదివారం సాయంత్రం 7 గంటలకు నెల్లూరు ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంత్రి లోకేశ్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

రంగడికి గరుడసేవ



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో శనివారం రంగనాథస్వామివార్లకు, పెరియాళ్వార్లకు ఉదయం తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం రంగడికి గరుడసేవ, పెరియాళ్వార్లకు గజవాహన సేవ, పేట ఉత్సవం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ ఎ.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

కరేడు భూములను కాపాడండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కందుకూరు నియోజకవర్గంలో కరేడు రైతులకు చెందిన వేల ఎకరాల భూములు ఇండోసోల్ సోలార్ కంపెనీపరం కాకుండా కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరేడు భూములను కాపాడుతామని గత ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక ఎకరా రూ.కోటి ఉన్న భూమిని ఆ కంపెనీకి రూ. 20 లక్షలకే ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విద్యార్థులకు రూ.6,600 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సహాయ కార్యదర్శి మాలకొండయ్య, నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి, సిరాజ్, షానవాజ్, మధు రమణయ్య, శంకర్ కిశోర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా, శిరీషా, వినోదిని పాల్గొన్నారు.

ట్యాక్స్ సర్వేను పూర్తిచేయండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ట్యాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యత కల్పించి, నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో సర్వేను పూర్తి చేయాలని కమిషనర్ నందన్ రెవెన్యూ అధికారులు, వార్డ్ అడ్మిన్ కార్యదర్శులకు సూచించారు. ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడుతో కలిసి రెవెన్యూ సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటి ట్యాక్స్ రివిజన్ సర్వేను వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.

రేపటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఈనెల 7వ తేదీ సోమవారం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ నందన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రొట్టెల పండగ నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులను దర్గాలో ప్రత్యేక విధులకు కేటాయించినందున గ్రీవెన్స్‌డేను నిర్వహించడం లేదని తెలియజేశారు.

జేవీవీ జిల్లా మహాసభ నేడు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభ జరుగుతుందని ఆ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ జీవనశైలి– మార్పు, భారత రాజ్యాంగం–ప్రియాంబుల్, గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై సదస్సు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.